ఆకుల బాలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

మృతుల కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ

సిద్దిపేట/నంగునూరు, ఏప్రిల్ 12: సిద్దిపేట నియోజకవర్గంలోని పలువురు మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం పరామర్శించారు. నంగునూరు మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన యువజన విభాగం అధ్యక్షుడు, ముండ్రాయి క్రికెట్ టీం కెప్టెన్ జగదీశ్ మృతిచెందగా గ్రామానికి వెళ్లి జగదీశ్ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని ధైర్యాన్ని ఇచ్చారు. సిద్దిపేట పట్టణానికి చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ ఆకుల బాలయ్య, నాయకం వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యాలతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానం

సిద్దిపేట, ఏప్రిల్ 12: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోనీ నాసర్‌పుర శ్రీహనుమాన్ దేవాలయం, పాత మార్కెట్‌లోని దాసాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 17న జరిగే సీతారాముల కల్యాణానికి రావాలని ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, చిప్ప ప్రభాకర్, అయిత రత్నాకర్, గుండు రవితేజ పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దేవాలయ నిర్వాహకులు

పలువురికి పరామర్శ

గజ్వేల్, ఏప్రిల్ 12: మండలంలోని కోమటిబండ మాజీ సర్పంచ్ తూం శేఖర్ తల్లి సుగుణమ్మ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆయన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. మండలంలోని రిమ్మనగూడలో అనారోగ్యంతో మృతిచెందిన పంజాల రాములుగౌడ్ కుటుంబ సభ్యులను మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు.గ్రామానికి చెందిన శివగల్ల రామచంద్రం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాయకులు కనకయ్య, మురళి, బాల్‌రాజుగౌడ్, శ్రీనివాస్, సాయితేజ, బాబు, రవి పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 12: హుస్నాబాద్ పట్టణ 19వ వార్డు కౌన్సిలర్ బొజ్జ హరీశ్‌కుటుంబ సభ్యులను శుక్రవారం బీఆర్ఎస్ యువ నాయకుడు వొడితెల ఇంద్రనీల్ పరామర్శించారు. కౌన్సిలర్ బొజ్జ హరీశ్ తండ్రి తిరుపతి మూడు రోజుల క్రితం మృతిచెందాడు. తిరుపతి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతీక్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ నాయకులు గందె చిరంజీవి, బత్తుల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఇంద్రనీల్

సీఎంను కలిసిన ముదిరాజ్‌లు

చేర్యాల, ఏప్రిల్ 12 : సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ ముదిరాజ్ జేఏసీ జనరల్ సెక్రటరీ బీమాలక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కుల సంఘం ప్రతినిధులు కలిసి కుల సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ కుల సమస్యలను పరిష్కరిస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ జేఏసీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సుధాకర్, మహిళా కన్వీనర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న లక్ష్మణ్ తదితరులు

తనిఖీల్లో నగదు పట్టివేత

చేర్యాల, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్త్యాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు రూ.లక్షా 60వేలు పట్టుకున్నట్లు సీఐ శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ డా.అనురాధ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సీఐ, ఎస్సై, సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా 60వేలు పట్టుకున్నట్లు తెలిపారు. రూ. 50వేల కంటే ఎక్కువ తీసుకువెళ్తే సరియైన పత్రాలు ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్త్యాల చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో సీఐ, ఎస్సై

గౌరారం వద్ద...

వర్గల్, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజంపేట మండలం లక్ష్మక్కపల్లికి చెందిన గిర్రాజు కనకయ్య టాటాఏస్ వాహనం సోదాచేయగా అందులో రూ.76,640లు గుర్తించడం జరిగిందని, సదరు నగదును ఎలక్షన్ సెల్‌కు పంపించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

కాలనీలకు తాగునీటి సౌకర్యం

తాగునీటి బావిని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి తదితరులు

అక్కన్నపేట, ఏప్రిల్ 12: మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులు కొందరు నందారం క్రాస్ రోడ్డు వద్ద కొత్తగా బంజారా హిల్స్, సేవాలాల్‌తండాలు ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటి ఇబ్బందులు ఉండటంతో గూడాటిపల్లి మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి సమస్యను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిషన్‌భగీరథ ఎస్ఈ శ్రీనివాస్‌చారి, డీఈ రుహీనా తస్కీన్ తండాలకు తాగునీటిని అందించేందుకు ప్రాజెక్టు సమీపంలోని ఓ బావి నుంచి పైపులైన్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకులకు నీటిని సరాఫరా చేయించారు. అక్కడి నుంచి ఇంటింటికీ తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈ మౌనిక, మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, గిరిజనులు, రైతులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికే రెచ్చగొట్టే ప్రయత్నాలు

- డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల తరపున పోరాడుతాం
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ లబ్ధికోసమే గజ్వేల్ పట్టణానికి చెందిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్ధిదారులను లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేసిన కొద్ది రోజులకే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అధికారులు అర్హులైన వారికి అందించడంతో అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. లబ్ధిదారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసున్నారని, అర్హులైన వారికి మూడు సార్లు సర్వేల ఆధారంగా లక్కీడ్రా చేసి కేటాయించారన్నారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితులకు తాత్కాలికంగా ఇవ్వడంతో పంపిణీ చేయలేక పోయామన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్కీడ్రా పద్ధతిలో కేటాయించిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా కేటాయించాలని, లేనిపక్షంలో వారి పక్షాన పోరాటం చేస్తామన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఈనెల 2న జాయింట్ కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి సమస్యను తీసుకెళ్లారన్నారు. లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించకుండా తాత్సారం చేస్తే వారి తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ రోజు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి లబ్ధిదారులను కావాలనే పంపించారన్నారు. రోజూ లబ్ధిదారులను మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తున్నారని, అలాంటి చర్యలను మానుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ యువజన, విద్యార్థి చైతన్య సదస్సు



శుభం గార్డెన్స్‌లో సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

హుస్నాబాద్, ఏప్రిల్ 12: హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువజన, విద్యార్థి చైతన్య సదస్సు శనివారం జరుగనుంది. హుస్నాబాద్ పట్టణ శివారులోని శుభం గార్డెన్స్‌లో సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. యూత్ నాయకులు ఇంద్రనీల్‌బాబు, బోయినపల్లి ప్రతీక్‌తో పాటు స్థానిక నాయకులు శుక్రవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల నుంచి యువజనులు, విద్యార్థులు హాజరు కావాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ కోరారు.

ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 12: రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్‌లోని కాగ్నిజెంట్ టెక్నాలజీ యాజమాన్యం ఇటీవల నిర్వహించిన స్కాలర్‌షిప్ ఎలిజిబిల్ టెస్ట్‌లో సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మంది విద్యార్థులు టెస్ట్‌లో పాల్గొనగా.. అందులో 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు కె.రామ్‌చరణ్, ఎ.సాయిచరణ్, జి.ఆనంది, కె.ప్రణతి, పి.దిలీప్, బి.ఆశ్రిత, డి.మణిదీప్ ఇందిరానగర్ పాఠశాల నుంచే ఎంపిక కావడం గమనార్హం. ఎంపికైన విద్యార్థులకు కాగ్నిజెంట్ టెక్నాలజీ వారి ట్యాబులు అందించి రోజూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా ఆన్‌లైన్ క్లాసులు తీసుకోవడం, భవిష్యత్‌లో వారి కంపెనీలోనే సాఫ్ట్‌వేర్ జాబ్‌లు ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ప్రభాకర్ తెలిపారు. ఇందిరానగర్ పాఠశాల నుంచే ఏడుగురు ఎంపిక కావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పోలీసుల ఆధీనంలో ఉన్న పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటో

మిరుదొడ్డి, ఏప్రిల్ 12: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పర్వతం శ్యామ్‌కుమార్ (20) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం (ఏపీ 24 ఎక్స్ 2551 నెంబర్) తన ఆటోలో అక్రమంగా 10క్వింటాళ్ల 50కిలోల పీడీఎస్ బియ్యాన్ని తిమ్మాపూర్ నుంచి ధర్మారం మీదుగా తరలిస్తున్నాడు. ఉదయం మిరుదొడ్డి మండలం ధర్మారంలో ఎస్సై తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

దగ్ధమైన తాటి, ఈత వనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హుస్నాబాద్, ఏప్రిల్ 12: హుస్నాబాద్ పట్టణ శివారులోని కల్లుగీత కార్మికుల చెందిన భూమిలో కొందరు చుట్టుపక్కల రైతులు నిప్పంటించి తాటి, ఈతవనం దహనం చేశారని, ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం దగ్ధమైన తాటి, ఈతవనాన్ని వారు సందర్శించారు. 10ఎకరాల స్థలంలోని సుమారు వెయ్యి వరకు తాటి, ఈత చెట్లు ఉన్నాయని తెలిపారు. నష్టపోయిన గీత కార్మికులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదుకోవాలని కోరారు. నాయకులు వేల్పుల రాజు, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సమ్మయ్యగౌడ్, పెద్ద రవి, పూదరి శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నిర్మాణం చేపట్టే కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

వైట్ ఫీల్డ్ బయోప్రోడక్ట్స్ కంపెనీ వద్ద ఆందోళన

బెజ్జంకి, ఏప్రిల్ 12: మండలంలోని పోతారం శివారులో నిర్మించే వైట్ ఫీల్డ్ బయోప్రోడక్ట్స్ ఇథనాల్ కంపెనీ వద్దకు శుక్రవారం నర్సింహులపల్లి, ముత్తన్నపేట, శంకర్‌నగర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కంపెనీ నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్నారని తెలుసుకున్న వారు నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల పహారాలో కంపెనీ యజమానులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కంపెనీతో ప్రజలకు ముప్పు ఉందని వెంటనే పనులు నిలిపివేయాలని, లేనియేడల ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రథమ చికిత్సాలయం ప్రారంభించి బీపీ చెక్ చేయించుకుంటున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 12 : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో తాళ్లపల్లి కావ్యకిరణ్ ప్రథమ చికిత్సాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్సాలయం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, ర్యాగల దుర్గయ్య, ఆర్ఎంపీలు శంభులు రామకృష్ణారెడ్డి, ఆరెపల్లి సురేందర్, కాటా అంజి, రాశుల నరేందర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

అక్కన్నపేట, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం పక్కన బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శుక్రవారం మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఎంపీటీసీ పెసరు సాంబరాజు, కులసంఘాల అధ్యక్షులు, గ్రామస్తులు కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 24, 25, 26వ తేదీల్లో గ్రామంలో దుర్గమ్మ, బొడ్రాయి పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి, పండుగ నిర్వహణ కోసం పూజ నిర్వహణ, ఆహ్వాన, సేవా, అన్నదాన కమిటీలు వేశారు. పూజారులు దుర్గమ్మ, బొడ్రాయి పండుగల ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు, కులసంఘం అధ్యక్షులు, పెద్దమనుషులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 12 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ప్రముఖ న్యాయవాది, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కొండపాక మండలం దుద్దెడలో ఉమ్మడి కొండపాక జర్నలిస్టుల సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బలం.. తెలంగాణ గళాన్ని పార్లమెంట్‌లో బలంగా వినిపించాలంటే బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని రైతులను మోసం చేశారని, ఇప్పటికీ చాలా మంది రైతులకు రైతుబంధు పడలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సమయానికి రైతుబంధు, రైతాంగానికి కావాల్సిన నాణ్యమైన 24 గంటల కరెంట్ వచ్చిందన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక్ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి నాడు కలెక్టర్‌గా ఉండి ఎంతో కృషి చేసిన వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపిద్దామన్నారు. సమావేశంలో కొండపాక మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జీర్ర రాజుముదిరాజ్, ఉపాధ్యక్షుడు చెంది మల్లికార్జున్ ముదిరాజ్, ముదిరాజ్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సున్నం భాస్కర్ ముదిరాజ్, చింతల భాస్కర్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, చింతల యాదగిరి ముదిరాజ్, స్వామి, నాగరాజు, చందు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

చేర్యాల, ఏప్రిల్ 12: అధికారంలోకి రాగానే గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఎత్తివేస్తాం, అధిక ధరలకు మద్యం విక్రయించకుండా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించింది. ఎలాంటి అనుమతి లేకుండా వైన్‌షాపుల నిర్వాహకులు ఆటోల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న బెల్ట్‌షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వైన్‌షాపుల నిర్వాహకులు బెల్ట్‌షాపులకు ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరుపుతుండడంతో గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిందంటే మొదటగా గ్రామాల్లో బెల్ట్‌షాపులను సంబంధిత శాఖ అధికారులు మూసివేయించేవారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేసేవారు. గత ఎన్నికలకు భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసి నెల రోజులు గడుస్తున్నా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు జోరుగా కొనసాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో మూడు నుంచి ఆరు వరకు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వైన్‌షాపుల నుంచి బెల్ట్‌షాపుల నిర్వాహకులు కొనుగోలు చేసుకుపోయిన మద్యాన్ని గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కో క్వాటర్‌పై రూ.20, బ్రాండెడ్ మద్యంపై రూ.30 వసూలు చేస్తున్నారు. ఫుల్ బాటిల్‌పై రూ.60 నుంచి 80 వసూలు చేస్తున్నారు. బెల్ట్‌షాపులు ఉదయం ఆరు నుంచి రాత్రి 12 గంటల వరకు కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బెజ్జంకి, ఏప్రిల్ 12: మండలంలోని కల్లెపల్లి శివారులోని ఇట్టిరెడ్డిపల్లికి చెందిన ఇట్టి రెడ్డి కాంతవ్వ(85) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కాంతవ్వ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నది. శుక్రవారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జనగామకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

జనగామకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 12 : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా జనగామ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగింది. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో జనగామకు తరలి వెళ్లారు.

నేటి యువగర్జనను విజయవంతం చేయాలి

తొగుట, ఏప్రిల్ 12: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు దౌల్తాబాద్‌లోని వీఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే యువగర్జన విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని యువత, విద్యార్థి, సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు ఉదయం10 గంటలకు బైక్ ర్యాలీ ద్వారా దౌల్తాబాద్‌కు పెద్ద ఎత్తున బయలుదేరి విజయవంతం చేయాలని వారు కోరారు

నేడు బీఆర్ఎస్ యువభేరి సభ

రాయపోల్, ఏప్రిల్ 12: దౌల్తాబాద్ మండల కేంద్రంలో శనివారం దుబ్బాక నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువభేరి సభ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, రాయపోల్, చేగుంట, నార్సింగ్ దౌల్తాబాద్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల యూత్ నాయకుడు సయ్యద్ కలీలొద్దీన్ కోరారు.

ముగిసిన కోటి తలంబ్రాల దీక్ష

గజ్వేల్‌లో తలంబ్రాలను చూపిస్తున్న మహిళా భక్తులు

గజ్వేల్, ఏప్రిల్ 12: కొద్ది రోజులుగా రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో చేపట్టిన కోటి తలంబ్రాల దీక్ష శుక్రవారం ముగిసిందని రామకోటి రామరాజు తెలిపారు. దీక్షలో ఆయా జిల్లాలకు చెందిన భక్తులు వేలాదిగా పాలుపంచుకొని విజయవంతంగా ముగించారు. భద్రాచలం దేవాలయం వారు అందజేసిన 150కిలోల వడ్లను తలంబ్రాలుగా వలిచి రామభక్తిని చాటుకున్నారు. శ్రీరామనవమి వరకు తలంబ్రాలను ఆలయ నిర్వాహకులకు రామరాజు అందజేయనున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) ఏప్రిల్ 12: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో